క్లుప్తంగా

త్వరితగతిన తూకం వేయాలి



కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట, కోనాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం తహసీల్దార్ రజనికుమారి సందర్శించారు. త్వరితగతిన తూకం వేయాలని, రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే కేటాయించిన రైసు మిల్లులకు పంపాలని ఆదేశించారు.

కొనసాగుతున్న ఉపాధి పనులు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ సంతోష్‌కుమార్

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. గురువారం జూకల్, వీరోజీపల్లి, ఉత్తులూర్, పెద్దశంకరంపేటలో ఉపాధి హామీ పనులను ఈజీఎస్ ఏపీఓ సంతోష్‌కుమార్ పరిశీలించారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించి, కూలీలకు సూచనలందించారు. పని ప్రదేశాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు.

పహల్గాం మృతులకు నివాళులు



మృతులకు నివాళులర్పిస్తున్న వాకర్స్

నర్సాపూర్: పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారికి వాకర్స్ నివాళులర్పించారు. గురువారం ఉదయం నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో దాడి ఘటనను ఖండిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన వ్యాపారులు శ్రీధర్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు పలువురు ఉద్యోగులు, యువకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండల పరిధిలోని ధనూరలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేందాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మ రమేష్, జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు నరసింహారెడ్డి, పాపయ్య, కిష్టాగౌడ్, మాజీ డైరెక్టర్ విద్యాసాగర్, సొసైటీ ఇన్‌చార్జి సీఈఓ సాయిలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



చండీ గ్రామంలో చెరువులో తవ్వకాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి చెండీ లోతాన్ చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా జేసీబీ తో తవ్వకాలు చేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టరాజ్యంగా చెరువులో తవ్వకాలు చేస్తుండడంతో పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పాడ్డాయని, ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం గురించి ఇరిగేషన్ ఈఈ సునీత దృష్టికి తీసుకెళ్లగా చండీ లోతాన్ చెరువులో మట్టితవ్వకాలకు సంబంధించి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తవ్వకాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కంప్యూటర్ విద్యతో ఉపాధి

- నాలుగు ప్రభుత్వ కళాశాలల్లో కంప్యూటర్ విద్య
- ఆసక్తి చూపుతున్న యువత

చేగుంట (తూప్రాన్): పదో తరగతి తర్వాత విద్యార్థులు తమ ఆసక్తి మేరకు కోర్సులు ఎంపిక చేసుకోవడం సాధారణ విషయమే. ఇంటర్మీడియెట్ స్థాయిలో ఒకేషనల్ కోర్సులో భాగంగా కంప్యూటర్ విద్యను ప్రభుత్వం అమలు చేస్తోంది. మెదక్ జిల్లాలో చేగుంటతో పాటు చిన్నశంకరంపేట, రామాయంపేట, మెదక్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ కోర్సుగా కంప్యూటర్ సైన్స్‌ను బోధిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి దాదాపు 160 మంది విద్యార్థులు కంప్యూటర్ కోర్సును పూర్తి చేస్తున్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో కంప్యూటర్ కోర్సు చదివిన విద్యార్థులు 90 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించడం విశేషం. చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు 900లకు పైగా మార్కులు సాధించి జిల్లా స్థాయిలో టాపర్లుగా నిలిచారు. కంప్యూటర్ కోర్సుతో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత చదువుల్లో బీటెక్, ఇంజినీరింగ్, కంప్యూటర్ విద్యను అభ్యసించే అవకాశం లభిస్తోంది. అంతేకాకుండా, చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ కోర్సు చదివిన విద్యార్థులు చాలా మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో పాటు, ఏడుగురు కానిస్టేబుల్ ఉద్యోగాలు, ఇద్దరు ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించారు. మరికొందరు విద్యార్థులు సొంతంగా కంప్యూటర్ కేంద్రాలను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. జాబ్ మేళా కార్యక్రమాల్లో కూడా కంప్యూటర్ కోర్సు చదివిన విద్యార్థులకు ప్రైవేటు పరిశ్రమలు మొదటి ప్రాధాన్యతనిస్తున్నాయి. సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు కంప్యూటర్ కోర్సులో నైపుణ్యం సాధించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.



చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటున్న విద్యార్థులు.

కంప్యూటర్ విద్యతో ఉపాధి



కంప్యూటర్ విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులు ఖచ్చితంగా ఉపాధి పొందే అవకాశం ఉంది. ప్రతి సంవత్సరం విద్యార్థులు 90 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధిస్తున్నారు. కంప్యూటర్ విద్యతో ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు ఉద్యోగాలకు కూడా అవకాశాలు మెండుగా ఉన్నాయి.

– ప్రమోద్, కంప్యూటర్ లెక్చరర్, చేగుంట

పేద విద్యార్థులకు వరం



ప్రభుత్వ కళాశాలల్లో కంప్యూటర్ విద్య పేద విద్యార్థులకు ఒక వరం లాంటిది. ఒకేషనల్ కోర్సులో భాగంగా కంప్యూటర్ విద్యను నేర్చుకోవడం ద్వారా ఎన్నో రకాల ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో కంప్యూటర్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇంటర్మీడియట్ స్థాయి నుంచి ఏర్పాటు చేసిన ఈ కంప్యూటర్ విద్యను గ్రామీణ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, చేగుంట

వరంగల్ సభకు పాదయాత్ర

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన గడ్డమీది రవి వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పాదయాత్రగా గురువారం బయలుదేరి వెళ్లారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీలో కొనసాగుతున్నారు. గ్రామం నుంచి సుమారు 180కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగనుంది. మాజీ సీఎం కేసీఆర్‌పైన ఉన్న అభిమానంతో పాదయాత్రగా వెళ్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు రవిని సన్మానించారు.



కొడిపల్లి: పాదయాత్రగా వెళ్తున్న రవి

బీజేపీ నిరసన ర్యాలీ

చేగుంట(తూప్రాన్): పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ చేగుంటలో గురువారం బీజేపీ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఉగ్రవాదులను వెంటనే శిక్షించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేష్‌రవికుమార్, టెలికాం బోర్డుమెంబర్ బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.



చేగుంటలో బీజేపీ నాయకుల నిరసన

విగ్రహాల ఊరేగింపు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గూడూరులో నిర్మిస్తున్న శ్రీ గురుపీఠంలో ప్రతిష్ఠంచనున్న విగ్రహాలను గురువారం సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు. గూడూరు వాసి హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ సంకల్పంతో ఈ నిర్మాణం జరుగుతుంది. సాయిబాబా, తత్త్రాత్రేయ దేవతామూర్తుల విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజస్తాన్ రాష్ట్రం జైపూర్‌లో తయారు చేయించిన విగ్రహాలను వేద పండితుడు శాస్త్రుల వామన శర్మ, రాజ పురోహితుల ఆధ్వర్యంలో స్థానిక కోదండరామస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేగోడ్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రేగోడ్(మెదక్): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై ముష్కరులు దాడి చేయడాన్ని నిరసిస్తూ రేగోడ్ మండల కేంద్రంలో గురువారం రాత్రి యువకులు, స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మృతిచెందిన భారతీయులకు నివాళ్లు అర్పిస్తూ శాంతి ర్యాలీ తీశారు.

నేడు నార్సింగిలో భూ భారతి సదస్సు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం భూ భారతి–ఆర్‌ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ షేక్ కరీం గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరుకానున్నారని తెలిపారు. మండలంలోని రైతులందరూ హాజరుకావాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లిలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చిన్నశంకరంపేట తహసీల్దార్ అబ్దుల్ మన్నన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాంటా చేస్తున్న ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు తాలు లేకుండా ధాన్యం తీసుకురావాలని కోరారు. కాంటాచేసిన ధాన్యం వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



గవ్వలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మన్నన్

కాపాడుకునే బాధ్యత అందరిది



విద్యార్థులతో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకొనే బాధ్యత మనందరిపైనా ఉందని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎంగా పని చేసిన ఇందిర ఉద్యోగ విరమణ పొందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇందిర సహకారంతో పాఠశాలకు ఎల్‌ఈడీ ప్యానెల్‌తో పాటు విద్యార్థులకు ట్యాబ్‌లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత ఆయా గ్రామాల ప్రజలపైనే ఉందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో మంచి బోధన ఉంటుందని భావించి తల్లిదండ్రులు అనవసరమైన భారాన్ని నెత్తిన వేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల ప్రగతి రిపోర్టు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బచ్చలి సత్తయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

యూనిఫాంలు సకాలంలో అందించాలి

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరానికిగాను పంపిణీ చేసే యూనిఫాంలను సకాలంలో పూర్తిచేసి అందించాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని వీరన్నపేటలో యూనిఫాంలు కుట్టే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీ నాటికి పూర్తిచేసి పాఠశాలకు పంపించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ కిష్టయ్య, స్థానిక ఉపాధ్యాయుడు కొండల్‌రెడ్డి ఉన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

మెదక్ మున్సిపాలిటీ: ఉగ్రదాడిలో మరణించిన టూరిస్టుల ఆత్మకు శాంతి చేకూరాలని గురువారం మెదక్ పట్టణంలోని చంద్రభవన్ కాలనీలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగిఅశోక్, మాజీ కౌన్సిలర్ రాగి వనజతో పాటు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీ వాసులు

ప్రభుత్వ భూమిలో నుంచి రోడ్డు

రెవెన్యూ అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు

తూప్రాన్: రియల్ వ్యాపారులు అక్రమంగా ప్రభుత్వ భూమిలోంచి మట్టి రోడ్డును నిర్మించారు. గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం తొలగించారు. ఈ సంఘటన మండలంలోని ఇస్లాంపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 14లో ప్రభుత్వ భూమి. ఈ భూమిలో చెట్లపల్లి మైసవ్వ, బాలయ్యలకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. ఈ భూమిని సాగు చేసుకొని జీవిస్తున్నారు. కాగా ఈ సర్వే నంబర్‌కు పక్కనే ఉన్న 13లో నాలుగు ఎకరాలు పట్టా భూమి ఉంది. ఈ భూమికి రోడ్డు మార్గం లేదు. కాని కొందరు రియల్ వ్యాపారులు రోడ్డు మార్గం ఉందని నమ్మ బలికి భూమిని విక్రయించారు. రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమిలో కబ్జాలో ఉన్నవారిని బెదిరింపులకు గురిచేసి మట్టి రోడ్డును నిర్మించారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు, బాధితులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ విజయలక్ష్మి ప్రభుత్వ భూమిలోంచి వేసిన రోడ్డుడు జేసీబీతో తొలగింపజేసింది. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్య తీసుకుంటామని హెచ్చరించారు.



రోడ్డును తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

కట్ట మైసమ్మకు బోనాలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మల్కాపూర్‌లో కట్ట మైసమ్మ బోనాల వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గురువారం పుర వీధుల గుండా యువకుల నృత్యాలు, కేరింతల మధ్య అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం, చీరలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మార్కులు ప్రామాణికం కాదు



అదనపు ఎస్పీని సన్మానిస్తున్న నిర్వాహకులు

అదనపు ఎస్పీ మహేందర్

నర్సాపూర్: విద్యార్థి అభివృద్ధికి మార్కులు ప్రామాణికం కాదని, తక్కువ మార్కులు సాధించిన వారు సైతం తమ ప్రతిభతో ఉన్నతస్థాయిలో ఉన్నారని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. గురువారం రాత్రి నర్సాపూర్‌లోని విష్ణు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫెయిల్యూర్ అనేది విజయానికి మొదటి మెట్టు అని అన్నారు. ధైర్యంగా విజయం దిశగా ముందడుగు వేయాలని సూచించారు. కార్యక్రమంలో బీవీ ఆర్ఐటీ కాలేజ్ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే, వైపర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రమేష్, విష్ణు ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జామీ, వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సంఘం చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేష్ ధాన్యాన్ని తూకం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని రైతులను కోరారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం పూటే ఉపాధి పనులు



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎండలు ఎక్కువ అవుతున్నందున ఉపాధి కూలీలు ఉదయం 7 గంటలకే పనులకు హాజరై 11 గంటలకు పనులు ముగించుకోవాలని ఎంపీడీఓ ఆనంద్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని చండూర్ గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించి, కూలీలకు ఉపాధి పనుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యే ముందు, పనులు ముగిశాక తప్పనిసరిగా ఫొటోలు దిగాలన్నారు. కూలీలు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకుంటూ, కొలతల ప్రకారం పనులు చేస్తేనే అత్యధిక కూలి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీఏ సురేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యం, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన భేష్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ తండాలో మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించి ఉచిత శస్త్రచికిత్సలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమన్వయ కర్త రవి విలేకరులకు వెల్లడించారు. ఆస్పత్రి వైద్యులు డాక్టర్ భాగ్యసాయి, డాక్టర్ కౌశిక్‌రెడ్డి, సానీక్ష ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శివ పాల్గొన్నారు.



మండలంలోని ఖాజాపూర్ తండాలో వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

లైబ్రేరియన్ లేక అవస్థలు

- తెరుచుకోని పుస్తకాల గది
- వారానికి ఒకరోజు మాత్రమే ఇన్‌చార్జి లైబ్రేరియన్ విధులకు హాజరు
- పాఠకుల పాట్లు

రేగోడ్(మెదక్): గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రంథాలయాలు ఏర్పాటు చేసిన ఉన్నతాధికారుల నిర్లక్ష్యం.. లైబ్రేరియన్ల ఇష్టారాజ్యం ఫలితంగా పాఠకులకు ఇబ్బందులు తప్పడం లేదు. వారానికి ఒకరోజు మాత్రమే విధులకు హాజరు.. ఇక పుస్తకాల గదికి తాళం పడి ఉంటుంది. ఇదీ జిల్లాలోని మారుమూల మండల కేంద్రంలోని గ్రంథాలయం దుస్థితి. రేగోడ్ మండల కేంద్రంలో సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ప్రభుత్వం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో సుమారు ఐదు వందల మంది సభ్యత్వం తీసుకున్నట్లు తెలుస్తోంది. నాటి నుంచి మొన్నటి వరకు అద్దె భవనంలో గ్రంథాలయం కొనసాగుతున్నా గతంలో పాఠకుల నుంచి ఆదరణ ఉండేది. ఇది వరకు ఇక్కడ పని చేసిన లైబ్రేరియన్లు స్థానికంగా నివాసం ఉండి గ్రంథాలయ అభివృద్ధి కోసం తమవంతు కృషి చేశారు. కానీ సుమారు రెండేళ్ల నుంచి ఇన్‌చార్జి లైబ్రేరియన్ సరిగా రాకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల్లో ప్రతీ బుధవారం మాత్రమే విధులకు వస్తారని పాఠకులు ఆరోపిస్తున్నారు. అయితే గ్రంథాలయంలోని పుస్తకాల గదికి తాళం ఉండటంతో పుస్తకాలకు పాఠకులు దూరం అవుతున్నారు. పెద్దశంకరంపేట లైబ్రేరియన్‌కు రేగోడ్, అల్లాదుర్గం గ్రంథాలయాలకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో గ్రంథాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రేగోడ్: పాఠకులు లేక ఖాళీగా ఉన్న గ్రంథాలయం



పుస్తకాల గదికి తాళం వేసి ఉన్న దృశ్యం

ఎప్పుడు వస్తారో తెలియదు



గ్రంథాలయం ఉన్నమాటే కానీ అందులో లైబ్రేరియన్ విధుల్లో ఎప్పుడూ కనిపించడం లేదు. ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో కూడా తెలియదు. పుస్తకాలను చదువుకోవాలని యువతకు ఆస్తకి ఉన్నా లైబ్రేరియన్ లేక పుస్తకాల గదికి తాళం వేసే ఉంటుంది. గ్రంథాలయం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– మహేశ్, యువజన సంఘం నాయకుడు, రేగోడ్

అదనపు బాధ్యతలు ఉన్నాయి

పెద్దశంకరంపేట లైబ్రేరియన్‌గా పని చేస్తున్న నాకు రేగోడ్, అల్లాదుర్గం గ్రంథాలయాలకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. వారం రోజుల్లో ఒకరోజు (బుధవారం)రేగోడ్‌కు, అల్లాదుర్గంకు సోమవారం వెళ్తున్న. దీంతో కొంత ఇబ్బందులు తప్పడం లేదు.

–సుజాత, లైబ్రేరియన్